మొక్కలు నాటిన ఎమ్మెల్యే అన్నా

విశాలాంధ్ర-కంభం : కంభం మండలం యల్ కోట గ్రామ పంచాయితి పరిధిలోని పాఠశాలలో అజాధికా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో శుక్రవారం గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు అన్నా వెంకట రాంబాబు పాల్గొని. నా మట్టి -నాదేశం,మట్టికి ప్రణామాలు - వీరులకు వందనాలు భాగంగా ఎమ్మెల్యే అన్నా మొక్కలు నాటారు. అనంతరం దేశంకోసం అత్యున్నత మైన త్యాగం చేసిన ధైర్య వంతులందరికి కృతజ్ఞతలు తెలుపుతూ వారి త్యాగాలకు ప్రతీకగా శిలా ఫలకం (స్మారక చిహ్నాన్ని) ఆవిష్కరించి అమరవీరులకు అంకితం చేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ప్రకాశం జిల్లా

రైతులకు విత్తనాల పంపిణీ

విశాలాంధ్ర-పెద్దారవీడు : మండల కేంద్రమైన పెద్దారవీడులోని ఆర్ బికే నందు మార్కాపురం డివిజన్ ఐబీ ఎంటి లలితమ్మ ఆధ్వర్యంలో మండల అగ్రికల్చర్ ఆఫీసర్ బుజ్జిబాయి సమక్షంలో ప్రకృతి వ్యవసాయ ఎస్సీ రైతులకు విత్తన ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా లలితమ్మ మాట్లాడుతూ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఎస్సీ రైతులు కూడా ముందు తీసుకురావాలని ఉద్దేశంతో వారి పంటలకు అవసరమగు విత్తనాలను పంపిణీ చేయడం జరిగింది. ప్రతి ఒక్కరూ రసాయన రహిత వ్యవసాయ సాగు చేయాలని పిలుపునిచ్చారు. రైతులందరికీ అందుబాటులో కషాయాలు- ద్రావణాలు తయారీలో తెలియజేశారు. సంవత్సరం పాటు భూమిని పచ్చగా కప్పి ఉంచితే నేల తేమ శాతం పెరిగి సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి. ఈ కార్యక్రమంలో మండల ఏవో, ఐబీ ఎంటి లలితమ్మ పాల్గొన్నారు.

విమానయాన పరిశ్రమకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై ఎంపీ మాగుంట ప్రశ్న

విశాలాంధ్ర-ఒంగోలు : దేశంలో విమానయాన పరిశ్రమ నిర్వహణ మరియు మరమత్తుల రంగానికి 4 సంవత్సరాలనుండి అందిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల గురించి, ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతివిమానాశ్రయ సెంటర్ నిర్వహణ మరియు మరమత్తుల పూర్తి గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. దీనికి కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయక మంత్రి వి.కే.సింగ్ (రిటైర్డ్)సమాదానమిస్తూ దేశంలో విమానయాన పరిశ్రమ నిర్వహణ మరియు మరమత్తుల రంగాన్ని విస్తృతం చేయటకు కేంద్ర ప్రభుత్వం ఉదార మరియు పెట్టుబడి దారులతో స్నేహ పూర్వక విధానాన్నిఅనుమతించినదని మరియు ఈ రంగానికి సంబంధించి ప్రత్యేక డేటా ఏదీ పౌర విమానయాన శాఖ నిర్వహించడం లేదని తెలిపారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకై తిరుపతి విమానాశ్రయ సెంటరుకు సంబంధించి భారత విమానాశ్రయ అథారిటీ వారు రెండు స్థలాలను గుర్తించి రెండు రౌండ్ల బిడ్లు కూడా ఆహ్వానించబడ్డాయని, కాని బిడ్లు ఇంకా అందలేదని కేంద్ర మంత్రి తెలియజేశారు.

కదిరికి జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : కనిగిరి మాజీ శాసనసభ్యులు వైసీపి నాయకులు కదిరి బాబురావు జన్మదినం సందర్భంగా గురువారం రాత్రి హైదరాబాద్‌లోని ఆయన నివాస గృహంలో పలువురు వైసీపి,టీడీపి నేతలు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. కదిరి బాబురావు చేత కేక్ కట్ చేయించి పూల బొకేలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్ళు ఆయురా రోగ్యాలతో ఉండి ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. కదిరి బాబురావును కలిసిన వారిలో వరికుంటపాడు మాజీ యంపిపి సుంకరి వెంకటాద్రి, ఉప్పలపాడు మాజీ యంపిటిసి సభ్యులు పాలగుల్ల మల్లి కార్జునరెడ్డి, ఆనికాలపల్లి సర్పంచ్ చెరుకుపల్లి రాధా కృష్ణారెడ్డి, రేగులచెలక సర్పంచ్ బత్తుల కృష్ణ కుమారి రమణయ్య, కటకం సత్యనారాయణ, గడ్డం రంగారెడ్డి, చోడా రవి, బసివి శేఖర్, తులాబందుల శ్రీనివాసులు, శ్రీరాం శ్రీనివాసులు, సంగిశెట్టి సుబ్బయ్య నాయుడు, సిద్దు వేంకటేశ్వర్లు, బల్లిపల్లి శివ, సతీష్ రెడ్డి ఉన్నారు.

బాలికల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : బాలికల సంరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి కోరారు. శుక్రవారం యర్రగొండపాలెంలోని మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికల సంరక్షణకు, బాల్య వివాహాలపై అన్ని పాఠశాలలో, కార్యాలయాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. దేశవ్యాప్తంగా కొన్ని వేల మంది ప్రతి సంవత్సరం 18 ఏళ్ల లోపే బాలికలు బాల్య వివాహాల బారిన పడుతున్నారన్నారు. చిన్న వయసులోనే పెళ్లి చేసుకుని తల్లులుగా మారుతున్నం దువల్ల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందన్నారు. మాతృ మరణాల సంఖ్య కూడా హెచ్చరిల్లుతుందన్నారు. అందు వలన బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్క కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం సీడీని పద్మావతి, తహశీల్దార్ రవీంద్రారెడ్డి, ఎస్సై కోటయ్య, ఎంఇఓ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ



విశాలాంధ్ర-దొనకొండ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ తెలిపారు. మండలంలోని గంగదేవిపల్లి, ఆరవల్లిపాడు, లక్ష్మీపురం, ఇండ్లచెరువు గ్రామాల్లో శుక్రవారం జరిగిన నా భూమి-నా దేశం కార్యక్రమంలో ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి, నీరు, సారవంతమైన నేలను భావి తరాలకు అందించేందుకు పుడమి తల్లిని కాపాడుకుందామన్నారు. జాతీయ జెండా ఆవిష్కరించి, మట్టిపై ప్రతిజ్ఞ చేసి, శిలా ఫలకాన్ని ప్రారంభించారు. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు, గ్రామాల అభివృద్ధికి భాగస్వాములు కావాలంటూ ఎంపీడీఓ వసంతరావునాయక్ తెలిపారు. అనంతరం మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎన్.సాంభ శివరావు, ఏపీఓ టి.దేవయ్య, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు గుజ్జుల యల్లమందారెడ్డి శతజయంతి ఉత్సవాలు ప్రారంభం

- ఒంగోలులో వెలిసిన ఫ్లెక్సీలు
- వేడుకలకు ముస్తాబయిన బాలయ్య కళ్యాణ మండపం



విశాలాంధ్ర-ఒంగోలు : శ్రమజీవుల హక్కుల సాధన కోసం పోరాటమే ఊపిరిగా అలుపెరగని వీరోచిత పోరాటాలు చేసిన ఆదర్శ కమ్యూనిస్టు, త్యాగధనుడు, స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఎంపి కామ్రేడ్ గుజ్జుల యల్లమందారెడ్డి శతజయంతి ఉత్సవాలుకు ఒంగోలు నగరం ముస్తాబయ్యింది. ఈ కార్య క్రమాన్ని పురస్కరించుకుని ఒంగోలు నగరంలో ఫ్లక్సీలు వెలిశాయి. బచ్చల బాలయ్య కళ్యాణ మండపంలో అన్ని సౌకర్యాలను సిద్దం చేశారు. ఈ కార్యక్రమాల ప్రారంభానికి ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా, ప్రముఖ ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్, జర్మన్ పార్లమెంట్ సెనేట్ సభ్యులు డాక్టర్ గుజ్జుల రవీంద్ర, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్యతో పాటుగా బికెఎంయు జాతీయ కార్యదర్శి కామ్రేడ్ ఎ రామమూర్తి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జల్లి విల్సన్, రాష్ట్ర నాయకులు పిజె చంద్రశేఖర్; ఎపి ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మలు హాజరు కానున్నారు. ఈసందర్భంగా పలు చర్చావేదికలు, సదస్సులు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలకు జిల్లాలోని సీపీఐ నాయకులు, కార్య కర్తలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు, గుజ్జుల యల్ల మందారెడ్డి, సరళాదేవి బంధుమిత్రులు, అభిమానులు, ఇతర వామపక్ష అభిమానులు, మేధావులు, ప్రజలు,ప్రజాస్వామ్యవాదులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : శ్రమజీవుల హక్కుల సాధన కోసం పోరాటమే ఊపిరిగా, అలుపెరగని వీరోచిత పోరాటాలు చేసిన ఆదర్శ కమ్యూనిస్టు, త్యాగ ధనుడు, స్వాతంత్ర సమర యోధులు, సీపీఐ పూర్వ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అమరజీవి కామ్రేడ్ గుజ్జుల యల్లమందారెడ్డి శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవేండ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం యర్రగొండపాలెం లోని సీపీఐ కార్యాలయంలో గుజ్జుల యల్ల మందారెడ్డి శతజయంతి ఉత్సవాల గోడ పత్రికలను సీపీఐ నాయకులు ఆవిష్కరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సమస్యల కోసం నిరంతరం అలుపెరగని పోరాటాలు చేశారని ఆయన అన్నారు. జిల్లాలోని సీపీఐ నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, గుజ్జుల యల్లమందారెడ్డి, సరళాదేవి గార్ల బంధుమిత్రులు, అభిమానులు, ఇతర వామపక్ష అభిమానులు, మేధావులు, ప్రజలు, ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ గౌడ్, సీపీఐ త్రిపురాంతకం మండల కార్యదర్శి బాణాల రామయ్య, సీపీఐ నాయకులు మొగిలి వెంకటేశ్వర్లు, యోగయ్య, వెంకట శివయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మాగుంటకు ధన్యవాదాలు

విశాలాంధ్ర-తాళ్లూరు : మండలంలోని లక్కవరం గ్రామంలో నెలకొని ఉన్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేసినందుకు ఒంగోలు పార్లమెంటు సభ్యులు మా గుంట శ్రీనివాస్‌రెడ్డి, ఆయన తనయుడు యువ పారిశ్రామికవేత్త మాగుంట రాఘవరెడ్డి లకు గ్రామ మాజీ సర్పంచ్ తూము శివ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ధన్యవాదాలు తెలిపారు. గత కొంతకాలంగా గ్రామంలో పలు సమస్యలు నెలకొని ఉన్నాయని వాటి పరిష్కారానికి ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాస్ రెడ్డి తన సొంత నిధులతో జెసిబి ద్వారా పనుల నిర్వహణకు సమస్యల పరిష్కారానికి ముందుకు వచ్చారని వారు తెలిపారు. ప్రధానంగా గ్రామ రహదారి ప్రక్కన గల చిల్ల చెట్లను తొలగించడం, వాటి గుంటలను చదును చేయడం, లక్కవరం నుండి 8 కిలోమీటర్ల మేర చిల్లచెట్లను తొలగించి, రోడ్డు చదును చేయడం, ఒక కిలోమీటర్ల మేరా పూడికతీత పనులు, కాలువల పూడికతీత పనులు, పొలాలకు వెళ్లే రోడ్లను చదువు చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాస్‌రెడ్డి, ఆయన తనయుడు రాఘవరెడ్డి లకు శివ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సంక్షేమానికే ప్రభుత్వ పథకాలు : ఎమ్మెల్యే బుర్ర

విశాలాంధ్ర-వెలిగండ్ల : ప్రభుత్వ పథకాలను, ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి గడపగడపను ఏర్పాటు చేశారని కనిగిరి శాసనసభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కంకణంపాడు పంచాయతీలో గడపగడప నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇల్లు తిరుగుతూ నవరత్నా పథకాలు ప్రజలకు ఏమేరకు అందు తున్నాయ లేదా అనేదానిపైన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుభిక్షమైన పరిపాలన అందిస్తూ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను చేరవేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తాతపూడి సుకుమార్, రాష్ట్ర కటిక కార్పొరేషన్ చైర్మన్ దాదా లక్ష్మీ కుమారి, ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్, కుప్పన బోయిన పద్మావతి, మాజీ జెడ్పిటిసి రామన తిరుపతిరెడ్డి, నాగూర్ యాదవ్, జార్జ్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు దేవ సహాయం, సింగిల్ విండో అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వర్లు, సచివాలయ కన్వీనర్ పోల్లా సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి గంజి రవీంద్రారెడ్డి, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, ఎస్ సి అధ్యక్షులు గోన జేమ్స్, బీసీ సెల్ అధ్యక్షులు ఎలిక రమణయ్య, దాదా సోమయ్య, పాణ్యం మురళి తదితర వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మేలైన సాగు పద్ధతులతో అధిక దిగుబడి

విశాలాంధ్ర-తాళ్లూరు : మేలైన సాగుపతులతో అధిక దిగుబడి సాధించవచ్చని, వాతావరణ పరిస్థితులు బట్టి పంటల సాగు చేపట్టాలని ఒంగోలు వనరుల కేంద్రం అధికారులు శైలజ, శేషమ్మ, మండల వ్యవసాయ అధికారి బి.ప్రసాద్‌రావులు అన్నారు. మండలంలోని దారం వారి పాలెం, శివరాంపురం గ్రామాలలో శుక్రవారం మేలైన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా వచ్చిన జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారులు శైలజ, శేషమ్మ, తాళ్లూరు మండల వ్యవసాయ అధికారి బి.ప్రసాద్ రావులు మాట్లాడుతూ సాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి వ్యవసాయం చేసినట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చని వారు తెలిపారు. నేడు వాతావరణంలో అనూహ్య మార్పులు సంభవించి ఎల్ నినో సమస్య ఏర్పడిందని దీనివల్ల వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, దీనిని అనుసరించి తక్కువ నీటితో పండే పంటల వైపు రైతులు దృష్టి సారించాలని వారు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా చిరుధాన్యాలను పండించి నీటి సంపదను మిగల్చడమే కాక ఆహార కొరత లేకుండా చూడాలని వారు రైతులను కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో ప్రకృతి సాగు మండల కోఆర్డినేటర్ పి నర సింహులు, ఏఈఓ నాగరాజు, వీఆర్వో, గ్రామ వ్యవసాయ సహాయకులు రాజశేఖర్ రెడ్డి, నవీన్, ఈసిఆర్‌పిలు మౌనిక, పల్లవి, గ్రామ రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడుకి దేశభక్తి ఉండాలి

ఆజాద్ కా అమృత మహోత్సవ్‌లో జడ్పీటీసీ

విశాలాంధ్ర-తాళ్లూరు : ప్రతి పౌరుడు దేశభక్తిని కలిగి ఉండి దేశ వికాసానికి కృషి చేయాలని జడ్పిటిసి మారం వెంకటరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన తాళ్లూరులోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల నందు శుక్రవారం ఆజాద్ కా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నా భూమి నా దేశం అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాల అయిన సందర్భంగా 75 మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరూ దేశాభిమానంతో దేశ ఔన్నత్యానికి కృషి చేయాలని జడ్పిటిసి మారం వెంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఐ వెంకటేశ్వరరెడ్డి, గ్రామ సర్పంచ్ మేకల చార్లెస్ సర్జన్, ఎంపీటీసీ -2 వై ప్రభుదాసు, ఈఓఆర్‌డి కేజీఎస్ రాజు, గ్రామ కార్యదర్శులు లక్ష్మీకాంత్, పాఠశాల ప్రిన్సిపాల్ సుజిత, ఏ పీ ఓ దేవరాజ్, సచివాలయం సిబ్బంది, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు

టీటీడీ చైర్మన్ పదవి సీఎం జగన్ బంధువులకేనా?

- బీసీలు అర్హులు కాదా?
- హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్న వైసీపీ ప్రభుత్వం
- కలియుగ వైకుంఠ దేవుదుని బీసీలకు దూరం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్
- ప్రకాశం జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు నందికనమ బ్రహ్మయ్య

విశాలాంధ్ర-ఒంగోలు : టీటీడీ బోర్డును తమ బంధువైన వైవి సుబ్బారెడ్డిని రెండుసార్లు, మరో బంధువు భూమన కరుణాకర్ రెడ్డిని నియమించి తిరుమల తిరుపతి ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని, జగన్ పై తెలుగుదేశం పార్టీ ప్రకాశం జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు నందికనుమ బ్రహ్మయ్య మండిపడ్డారు. తెదేపా ఏనాడూ బంధువులకు టిటిడి చైర్మన్ పదవి కట్టబెట్టలేదని స్పష్టం చేశారు. టిటిడి చైర్మన్ పదవిని జగన్ కుటుంబ పదవిగా మార్చేసారని నందికనుమ విమర్శించారు. తొలుత తన పెద్ద బాబాయ్ వైవి సుబ్బారెడ్డికి, ఇప్పుడు చిన్న బాబాయ్ భూమన కరుణాకర్ రెడ్డికి టీటీడీ చైర్మన్ పదవిని జగన్ కట్టబెట్టారని ఆయన విమర్శించారు. టీటీడీ చైర్మన్ పదవికి బీసీలు అర్హులు కారా అన్ని నందికనుమ సూటిగా ప్రశ్నించారు. బీసీలను మోసం చేస్తూ జగన్ బీసీల ద్రోహిగా మిగిలిపోతున్నారు అని విమర్శించారు. ఇతర కులాలు, ప్రజలు, ప్రతిపక్షాలు అంటే కనీస గౌరవం కానీ, మర్యాద కానీ వైసీపీ ప్రభుత్వానికి లేవని నందికనుమ వ్యాఖ్యానించారు.

గత టీడీపీ హయంలో బలిజ వర్గానికి చదలవాడ కృష్ణమూర్తి, తదుపరి యాదవ వర్గానికి చెందిన పుట్టా సుధాకర్ లు టీటీడీ చైర్మన్‌లుగా చేశారన్నారు. మురళీమోహన్, రాయపాటి సాంబశివరావులు బాహాటంగానే నాకు టిటిడి చైర్మన్ పదవి చేయాలనే ఆశ ఉంది అని అడిగినా, వత్తిడి తెచ్చినా చంద్రబాబు సామాజిక న్యాయం పాటించారని, తన సామాజిక వర్గానికి ఇవ్వలేదనే విషయాన్ని వైసీపీ నేతలు గ్రహించా లన్నారు. టిటిడి చైర్మన్‌లు వంటి కీలకమైన కార్పొరేషన్ చైర్మన్ పదవులన్నింటిలో జగన్ తన సామాజిక వర్గానికే ఇచ్చారని విమర్శించారు. ఇలానే వదిలేస్తే రేపు మళ్ళీ గెలిస్తే కాపు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ చైర్మన్ లను కూడా జగన్ తన సామాజిక వర్గానికే కట్టబెడతారని ఎద్దేవా చేశారు. క్రైస్తవ వర్గానికి చెందిన కరుణాకర్ రెడ్డిని టిటిడి చైర్మన్ గా నియమించి హిందువులకు కలియుగ వెంకటేశ్వర స్వామిని దూరం చేయడానికి జగన్ ప్రయత్నం చేస్తున్నారని, వైసీపీని బంగాళాఖాతంలో కలిపే సమయం ఆసన్నమైందని అందుకు రాష్ట్రంలోని బీసీలు సిద్ధంగా ఉండాలని బ్రహ్మయ్య పిలుపునిచ్చారు.

మాజీమంత్రి శిద్దాకి జన్మదిన శుభాకాంక్షలు

- మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం మాజీమంత్రి శిద్దా రాఘవరావు నివాసానికి విచ్చేసిన బాలినేని శ్రీనివాసరెడ్డి శిద్దా రాఘవరావుకి శాలువ కప్పి పుష్ప గుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శిద్దా రాఘవరావు బాలినేని శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వై.ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, మార్కాపురం మునిసిపల్ చైర్మన్ చిల్లంచెర్ల బాల మురళికృష్ణ, డిప్యూటీ మేయర్ వేమూరి శ్రీనివాసరావు,తాత ప్రసాద్,గొర్రెపాటి శ్రీనివాసరావు,,కటారి శంకర్ ,కార్పొరేటర్ ఆదిపూడి శాండిల్య, వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సున్నావడ్డీకి రుణాలు మంజూరు : కలెక్టర్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : సున్నా వడ్డీకి రుణాలు మంజూరు చేస్తూ స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ చెప్పారు. ఈ పథకం క్రింద లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో వడ్డీ డబ్బులను జమ చేసేందుకు శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పాల్గొనగా, దానికి అనుబంధంగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్తో పాటు ట్రైనీ కలెక్టర్ శౌర్య పదేల్, జడ్పీ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పి.డి.సి.సి. బ్యాంకు ఛైర్మన్ వై.ఎం.ప్రసాద్ రెడ్డి.. ఒంగోలు నగర మేయర్ శ్రీమతి గంగాధ సుజాత, పలువురు ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు బ్యాంకు చెక్కును వారు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 49,068 స్వయం సహాయక సంఘాలలోని 4.95,254 మంది లబ్ధిదారులకు ఆర్థిక ప్రయోజనం కలిగినట్లు చెప్పారు. 2019-20 సంవత్సరంలో రూ.80.05 కోట్లు, 2020-21లో రూ.69.26 కోట్లు, 2021-22లో రూ.73.29 కోట్లు, 2022-23లో రూ.65.66 కోట్ల చొప్పున జిల్లాలో ఇప్పటివరకు ఈ నాలు గేళ్లలో రూ.288.26 కోట్లను స్వయం సహాయక సంఘాలకు ప్రయోజనం కల్పించినట్లు వివరించారు. బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ మహిళలకు అన్ని విషయాలలో అండగా ఉంటూ మహిళా పక్షపాత ప్రభుత్వమని ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి నిరూపించుకుంటున్నారని కొని యాడారు. ఈ కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకా రావు, రాష్ట్ర ట్రైబర్ డెవలప్మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్పర్సన్ షేక్ సుబాన్బీ, డి.ఆర్.డి.ఏ. మరియు మెప్మా పి.డి. రవికుమార్ పాల్గొన్నారు.

సాగులో ఉన్న ప్రత్తి పైరు పరిశీలన

విశాలాంధ్ర-మార్కాపురం : మండలంలోని వేములకోట గ్రామంలో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు క్షేత్రస్థాయి పర్యటన చేయడం జరిగింది. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రస్తుతం అధికంగా సాగులో ఉన్నటువంటి ప్రత్తి పంటను పరిశీలించారు. అలానే ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతల కారణంగా రైతులు తాము పైర్ల యందు చేపట్టిన చర్యల గురించి అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రత్తి పంట బెట్టకు వచ్చినపుడు 2% పొటాషియం నైట్రేట్, 2% యూరియా మార్చి మార్చి పిచికారీ చేయడం వలన మంచి ఫలితం ఉంటుందని తెలిపారు. అలానే ప్రత్తిలో ఆకులు ఎర్రబడటాన్ని పండాకు తెగులు అని తెలుపుతూ వాటికి నివారణగా లీటరు నీటికి 10గ్రాముల మెగ్నీషియం సల్ఫేటు 1%తో పాటుగా 20 గ్రాముల యూరియా 2% కలిపి 5 నుంచి 7 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని రైతులకు వివరించారు. ప్రస్తుతం పైరులో చిత్త పురుగులు ప్రత్తి పంటను ఆశించి ఆకులను తినివేయడం వలన కూడా పంట ఎదుగుదల లేకుండాపోతుందని గమనించి దీనికి నివారణగా లీటరు నీటికి 2 మిల్లీ లీటర్ల క్లోరో పైరిపాస్ 20% ఇ సిని పిచికారీ చేయాలని తెలిపారు. చింతకుంట, మరియు తిప్పాయపాలెం గ్రామాల పరిధిలోని నర్సరీలను హెచ్.ఓ రమేష్ బాబు, ఏ.ఓ దేవిరెడ్డి శ్రీనివాసులు సందర్శించడం జరిగింది. హెచ్.ఓ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నర్సరీలను నిర్వహించాలని, కచ్చితంగా తగు రికార్డులను కూడా నిర్వహించాలని తెలిపారు.

స్కూల్ లెవెల్ క్రికెట్ అండ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్స్ ప్రారంభం

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో స్థానిక సంతపేటలోని డి.ఆర్.ఎం మున్సిపల్ హైస్కూల్ మైదానంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా క్రీడా సంబరాలు శుక్రవారం ప్రారంభమైనాయి. హైస్కూల్ లెవెల్ స్థాయిలో జరుగుతున్న క్రికెట్ అండ్ ఫుట్ బాల్ టోర్నమెంట్స్‌ను డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ అధికారిని డాక్టర్ వి. పుష్పలత, లార్డ్ బ్యాడ్మింటన్ అకాడమీ ఫౌండర్ అద్దంకి మురళీకృష్ణ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ క్రీడా పోటీలు యువతలో చైతన్యాన్ని, ఐకమత్యానికి, ఆరోగ్యంతో పాటు మానస వికాసానికి దోహదపడతాయన్నారు. క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంతరం అతిథులు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు. ఎజె సొల్యూషన్స్ డైరెక్టర్ శ్రీమతి ప్రియ, శ్రీ సాయి కాలేజీ ఆఫ్ హెల్త్ సైన్స్ డైరెక్టర్ లక్ష్మి, కోచూరి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కమిటీ సభ్యులు చిక్కాల కిరణ్ కుమార్. భాస్కర్, కిట్టు, నవీన్,శంకర్. గోపాల్ తదితరులున్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

విశాలాంధ్ర-దర్శి : దర్శి పట్టణంలో యువకుడు విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పట్టణంలోని పుచ్చల మిట్టకు చెందిన చొప్పరపు శ్రీనివాస రావు కుమారుడు వెంకటేశ్వర్లు (వెంకీ)22 రాజంపల్లి విద్యుత్ సబ్ స్టేషన్లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శిద్దా కాలనీలో విద్యుత్ స్థంభం ఎక్కి పని పూర్తి చేసి దిగే సమయం లో విద్యుత్ షాక్ కుగురై స్థంభం నుంచి కింద పడ్డాడు. తీవ్ర గాయలు అయిన అతనిని ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. చేతికి అంది వచ్చిన ఒక్కగానొక్క కొడుకు మృతి చెందటంతో ఆ కుటుంబం శోక సముద్రంలో మునిగి పోయింది.

ఇంటింటికి తాగునీరు ప్రభుత్వ లక్ష్యం

వైసీపీ నేత గంగసాని

విశాలాంధ్ర-పామూరు : ప్రతి ఇంటికి కొళాయిల ద్వారా త్రాగు నీరు అందించడమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని మండల వైసీపీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కంబాలదిన్నె పంచాయతీ ప్రజాసాహెబ్ పేట గ్రామంలో ఇంటింటికి కొలాయి పైప్ లైన్‌కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఇల్లు, విద్యా, వైద్యంతో పాటు ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, షేక్ ఖాదర్ భాష, గాజులపల్లి వెంకటేశ్వర రెడ్డి, పోలుబోయిన నరసింహారావు, నీలం శ్రీరాములు, వెంకటే శ్వర్లు, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

భానుశ్రీకి నగదు అందజేసిన సైన్సు ఉపాధ్యాయుడు రమేష్

ట్రిపుల్ ఐటి విద్యార్థినికి ఆర్థిక తోడ్పాటు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండలంలోని సి.నాగులవరంకు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2022-23 పదవ తరగతి విద్యార్థిని యడవల్లి వెంకట భానుశ్రీ ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిన సందర్భంగా ఆ విద్యార్థినిని అభినందిస్తూ ఆంధ్రప్రదేశ్ రవాణాశాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న పురేంద్ర రూ.10,000ల నగదు తోడ్పాటును తన స్నేహితుడు, పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు అయిన రమేష్ చేతుల మీదుగా విద్యార్థికి అందజేశారు. యడవల్లి భానుశ్రీ 10వ తరగతి పరీక్షలలో 564 మార్కులతో సియస్ పురం మండల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు హెచ్ వీరాంజనేయులు, ఉపాధ్యాయులు దాతకు ధన్యవాదాలు తెలియజేసారు. తండ్రి లేని తమ కుమార్తె చదువుకు మంచి మనస్సుతో ప్రోత్సాహం అందించిన పురేంద్రకి విద్యార్థి తల్లి సుబ్బరత్తమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

అపరిశుభ్రవాతావరణంలో బాధపడుతున్నాం

- తాగడానికి నీరులేదు. ఒకపూటనే స్నానం చేస్తున్నాం
- రాష్ట్ర బాలల కమీషన్‌కు మొరపెట్టుకున్న మురికిమల్ల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

విశాలాంధ్ర-పుల్లలచెరువు : రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి రెండవరోజు శుక్రవారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మురికిమల్ల తండాలోని ఆశ్రమ పాఠశాలను కమీషన్ సభ్యులు బత్తుల పద్మావతి, జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు. నీలిమ వంశీలతలు శుక్రవారం తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషన్ సభ్యులు పద్మావతి విద్యార్ధినీ విద్యార్థులతో ముఖాముఖి ఏర్పాటు చేశారు. పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులు తమ సమస్యలను కమీషన్ సభ్యుల తో మొరపెట్టు కున్నారు. విద్యార్థులు ఒక పూటనే స్నానం చేస్తున్నారని, తాగటానికి నీటి సౌకర్యం లేదని, బాత్రూములు అపరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. చదువుకోవడానికి లైట్లు,ఫ్యాన్ లు లేవని,రాత్రి పూట నిద్రపోవడానికి చాలా ఇబ్బంది పడుతున్నామని, క్లాస్ రూములలోనే నిద్రపోతున్నామని, అపరిశుభ్రమైన వాతావరణంలో ఉన్నామని, వాష్ రూములలో రన్నింగ్ వాటర్ లేదని,కరెంట్ పోయినప్పుడు ఇబ్బంది పడుతున్నామని, అన్ని సబ్జెక్ట్ లకు ఉపాధ్యాయులు లేరని, కొత్తవారిని నియమించాలని విద్యార్థులు కమీషన్ దృష్టికి తెచ్చారు. ఫిర్యాదుల బాక్స్ కూడా లేదని, ఉపాధ్యాయులు కూడా రాత్రి 7 గంటలకే వెళ్లిపోతారని విద్యార్థినిలు 213 మంది, విద్యార్థులు 18 మందివున్నారని, బాలురు ఆరుబయట నిద్రిస్తున్నారని, మల, మూత్ర విసర్జన అంతా అరు బయటే జరుగుతుందన్నారు. 213 మంది ఆడపిల్లలువుంటే ఒక్క టీచర్ కూడా ఉండరని,రాత్రి. పూట అపరిచితవ్యక్తులు గోడలు దూకి పాఠశాలలోకి వస్తున్నారని విద్యార్థినిలు కమీషన్ సభ్యుల ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. రాత్రి సమయాలలో తమకు రక్షణ లేదని వారు వాపోయారు. 10 డ్రమ్ములను తీసుకొని పిల్లలకు ఎప్పుడు తాగునీరు అందుబాటులో ఉంచాలని,అపరిశుభ్రవాతావరణాన్ని బ్లీచింగ్ వేసి,లైట్లు,ఫ్యాన్ లు, తాగునీరు, వాడుకనీరు అందేలా యుద్ధప్రాధిపధికన చర్యలు తీసుకోవాలని కమీషన్ సభ్యులు బత్తుల.పద్మావతి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రమైన పుల్లల చెరువు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను కమీషన్ సభ్యులు పద్మావతి తనిఖీ చేశారు.పాఠశాల ఆవరణ పరిశీలించారు. పాఠశాల పరిశుభ్రంగా వుండడంపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. టాయిలెట్లను పరిశీలించారు. టాయిలెట్లు శుభ్రంగా ఉండడంతో పారిశుధ్యకార్మికులు ఏమే లమ్మ, గురవమ్మలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగొండ పాలెం సీడీపీవో పద్మావతి, తహసిల్దార్ దాసు,ఎంపిడివో మరియదాసు, ఎంఈవోలు శామ్యూల్ జాన్, ఇందిరాప్రసాద్, సూపరవైజర్లు శివలక్ష్మి, సుబ్బమ్మ పాల్గొన్నారు.

20న నాగభైరవ పురస్కార ప్రదానోత్సవం

విశాలాంధ్ర-ఒంగోలు : డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు పేర ప్రతి సంవత్సరం చేస్తున్నట్లే ఈ సంవత్సరం కూడా నాగభైరవ సాహిత్య పీఠం పురస్కారాలను ప్రదానం చేస్తున్నది. ఆగస్టు 20వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ఒంగోలు, మల్లయ్య లింగం భవన్లో జరిగే పురస్కార ప్రదానోత్స వంలో ముఖ్య అతిథులుగా నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న), ఈదర హరిబాబు,డాక్టర్ నూనె అంకమ్మరావు, డాక్టర్ జక్కంపూడి సీతారామారావు, తేళ్ళ అరుణ పాల్గొంటారని పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ తెలియజేశారు. కథా సంపుటాలలో బహుమతులు పొందిన సింహప్రసాద్, సురేంద్ర శీలం, నాగేంద్ర కాశీలను వరుసగా రు.10,000/-, 5,000/-, 2,000/- చొప్పున నగదు బహుమతులతో సన్మానం చేస్తారు.నాగభైరవ కళా పురస్కారం(రు.10,000/-) శ్రీ బీనీడి కృష్ణయ్యగారికి, నాగభైరవ ఆత్మీయ పురస్కారం కళారత్న భూసురపల్లి వెంకటేశ్వర్లుగారికి ప్రదానం చేస్తారు.ఒంగోలులోని కవులు, రచయితలు, కళాకారులు అందరూ ఈ సభలో పాల్గొనాలని ఆదినారాయణ విజ్ఞప్తి చేశారు.

ఒంగోలు ఎంఈఓను కలిసిన ఏపీ టీజీ నాయకులు

విశాలాంధ్ర-ఒంగోలు : ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఒంగోలు ఎంఇఓకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏపిటిజి నాయకులు మాట్లాడుతూ ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని మునిసిపల్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు సంబంధించి మూడు సంవత్సరాల నుంచి పెండింగ్లో ఉన్న అన్ని రకాల అరియర్స్ బిల్లులను ఒంగోలు మండల విద్యాశాఖ అధికారి టి కిషోర్ బాబు సకాలంలో ఖజానా శాఖ అధికారులకు పంపి మున్సిపల్ ఉపాధ్యాయులకు మరియు ఎయిడెడ్ ఉపాధ్యాయుల 60 మరియు 62 సంవత్సరాల సంబంధించి గ్యాప్ పీరియడ్ కు సంబంధించి బిల్లులను సకాలంలో చేసి ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను పూర్తి చేసినందుకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఎపిటిజి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సిహెచ్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఓగిరాల వెంకటేశ్వర్లు, రవి, రమేష్, మండల విద్యాశాఖ అధికారి 2 పి సరస్వతి కి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే వెంకట్రావు, సిహెచ్ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

గుజ్జులు యల్లమందారెడ్డి శత జయంతి ఉత్సవాలకు తరలిరండి

సీపీఐ దర్శి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ బాబు

విశాలాంధ్ర-దర్శి : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ నాయకులు వ్యవసాయ కార్మిక సంఘం వ్యవస్థాపకులు కామ్రేడ్ గుజ్జుల యల్లమందారెడ్డి శత జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయని సిపిఐ దర్శి నియోజకవర్గ కార్యదర్శి మాడపాకుల రమేష్ బాబు తెలిపారు. ఆదివారం ఆయన శత జయంతి ఉత్సవాలను ప్రారంభోత్సవం సందర్భంగా ఒంగోలులో ప్రజా ప్రదర్శన బహిరంగ సభ జరుగుతుందని ఈ సభకు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డి.రాజా, గుజ్జుల ఎల్లమంద రెడ్డి కుమారుడు గుజ్జుల రవీంద్రబాబు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, సిపిఐ అగ్ర నాయకులు అనేకమంది పాల్గొంటున్నారని వివరించారు. గుజ్జులు ఎలమందరెడ్డి కనిగిరి ఎమ్మెల్యేగా మార్కాపురం ఎంపీగా పనిచేసి పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు సాధన కోసం ఉద్యమాలు చేసిన నాయకుడని నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి పోరాటంలో ముందుండి నడిచిన నాయకుడని కొనియాడారు. దేశవ్యాప్తంగా కార్మికులు, వ్యవసాయ కూలీల పక్షాన నిలబడి వ్యవసాయ కార్మిక సంఘం స్థాపించి దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికులకు గుర్తింపు తీసుకొచ్చిన గొప్ప కమ్యూనిస్టు నాయకుడు గుజ్జుల ఎల్లమంద రెడ్డి అని కొనియాడారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కే హనుమంతరావు, సిపిఐ దర్శి పట్టణ కార్యదర్శి జూపల్లి కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్ కరుణానిధి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి చిన్న ఆంజనేయులు పాల్గొన్నారు.

మాక్స్ ఫ్యాషన్స్ స్టోర్స్‌లో ఫ్రీడమ్ షాపింగ్ ఫెస్టివల్ సందడి

విశాలాంధ్ర - ఒంగోలు : మాక్స్ ఫ్యాషన్స్ ఫ్రీడం ఫెస్టివల్‌ను ప్రారంభించింది. ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఫ్రీడమ్ షాపింగ్ ఫెస్టివల్ సందర్భంగా మరెక్కడా లేని విధంగా ఫ్యాషన్ ప్రియుల కోసం అద్భుతమైన ఆఫర్లను అందిస్తుంది. ఆగస్ట్ 11 నుండి ఆగస్ట్ 15 వరకు ఈ ఫెస్టివల్ అన్ని మ్యాక్స్ షోరూమ్స్‌లో అందుబాటులో ఉంటుంది. ఇందులో భాగంగా ఎంపిక శ్రేణి పై 1 కొంటె 1 ఉచితంగా పొందే ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చింది. రాయితీ ఆఫర్లతో మీ వార్డ్‌రోబ్‌ను అప్‌గ్రేడ్ చేయడంలో థ్రిల్‌ను అనుభవించాలని కోరుతోంది.

విద్యార్థుల అభిమానాలే ఉపాధ్యాయులకు గుర్తింపు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : విద్యార్థుల అభిమానాలే ఉపాధ్యాయుల పనితీరుకు గుర్తింపు అని, రెడ్డిగారి కొత్త పల్లిలో పని చేసిన ఉపాధ్యాయులే దీనికి నిదర్శనమని సీయస్‌పురం ఎంఈఓ జె ప్రసాదరావు తెలిపారు. ఆర్‌కె పల్లి స్కూల్ నందు పనిచేసి బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్ళిన ఉపాధ్యాయులు కె దానమ్మ, షేక్ రంజాన్ బీల సన్మాన కార్యక్రమం స్కూల్ ప్రధానోపాధ్యాయులు గువ్వల రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. సిఎస్ పురం ఎంఈఓ-2 రాజాల కొండారెడ్డి మాట్లాడుతూ బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులు చక్కగా పనిచేశారని, పాఠశాలకు మంచి పేరు తెచ్చారని కొనియాడారు. అదే విధంగా ప్రభుత్వ పథకాలను పిల్లలు చక్కగా వినియోగించు కొని బాగా చదువు కావాలని కోరారు. బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సమా వేశంలో పాల్గొన్న పలువురు వక్తలు ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పిసీ కమిటీ ఉపాధ్యక్షురాలు నన్నసాని నాగేశ్వరి, గ్రామ పెద్దలు కాకు సుబ్బారావు మండల ఉపాధ్యాయులు నాయబ్ రసూల్, కె రామ సుబ్బారావు, జీ మల్లికార్జున రాజు, జెయస్ ఆనంద్ బాబు, తోట శ్రీనివాసులు, పి.మాలకొండయ్య, డి సుబ్బ రాయుడు, డి లలిత, జీ హరిబాబు, ఐశ్వర్య, ఎప్సిబా, హామద్, ఎలిక శ్రీను, సతీష్, మస్తాన్, మల్లికార్జున, అనూష పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే దేశభక్తి ఉండాలి

విశాలాంధ్ర-పామూరు : విద్యార్థి దశ నుంచే దేశభక్తిని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి అన్నారు. ఆజాద్ కా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగముగా శుక్రవారం మండలంలోని అయ్యన్నకోట అయ్యవారిపల్లి కోడిగుంపల మండల పరిషత్ పాఠశాలలో నా భూమి నా దేశం అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాల అయిన సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులతో దేశ భద్రతను కాపాడే విధంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా హుస్సేన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశాభిమానంతో దేశ గొప్పదనాన్ని చాటే విధముగా కృషి చేయాలన్నారు. ఎంపీడీవో వి శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడ రాంబాబు, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : భూమి లేని కౌలు రైతులకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణ సహాయం అందిస్తుందని ఈ అవకాశాన్ని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎండి ఫారుక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేసపు హాలులో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్ పర్సన్ మారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ భూమి లేని కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణ సహాయం ఇప్పించడం జరుగుతుందని అన్నారు. కిసాన్ డ్రోన్ పైలెట్ ట్రైనింగ్ ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ వారు ట్రైనింగ్ ఇస్తారని, వ్యవసాయ పట్టభద్రులు డిప్లమో లేదా ఇంటర్మీడియట్ చదువుకున్న వారు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోని శిక్షణ పొందాలన్నారు. పశు వైద్యాధికారిని ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ గడ్డి కోత మిషన్లు రాయితీపై ఇస్తున్నామని, అలాగే వర్షాకాలంలో పశువులకు గొర్రెలకు వచ్చే వ్యాధులను నివారించడానికి ఆర్‌బికే పరిధిలో వ్యాక్సినేషన్ వేస్తున్నామని తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డు, వైయస్సార్ పశు బీమా మొదలగు పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏ ఏలు, రైతులు పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు

పొంచి ఉన్న ప్రమాదం - ఆందోళనలో రైతులు

ఒరిగిపోయిన స్తంభం

చేతికందె విద్యుత్ తీగను చూపుతున్న రైతు

విశాలాంధ్ర-తర్లుపాడు : రైతుల శ్రేయస్సు కోరి ప్రతిమూడు బోర్లకు 33/11 కె.వి.ట్రాన్స్ఫార్మర్లను ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసింది. దీంతో రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు పండించుకుంటున్నారు. కానీ ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల, ఈదురు గాలుల వల్ల కరెంటు స్తంభాలకు బిగించిన విద్యుత్ తీగలు లూజు కావడంతో రస్తాలో కిందకు వేలాడుతుండటం జరిగింది. దీంతో అక్కడ తిరుగుతున్న రైతు సోదరులకు, రైతు కూలీలకుప్రమాదం సంభవిస్తుందని ముందుగానే పసిగట్టిన రైతులు సంబంధాధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న ఎలాంటి స్పందన కనిపించడం లేదని అక్కడి రైతులు తిరుమలరెడ్డి పుల్లారెడ్డి, మల్లికార్జున్, మరికొందరు రైతులు వాపోతున్నారు. ఇప్పటికే రైతు పొలాల్లో ఉన్న స్తంభాలు ఈదురు గాలులకు ఒకవైపు వంగిపోయి ప్రమాదాన్ని తలపిస్తున్నాయి. వేలాడుతున్నవిద్యుత్ తీగలతో,ఒ రిగి పోయిన స్తంభాలతో ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని రైతులు, ప్రజలు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నారు. ఇప్పటికీ విద్యుత్ అధికారులలో ఎలాంటి చలనం లేకపోవడం చాలా బాధాకరంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే రైతు పొలాల్లో ప్రమాదాన్ని తలపిస్తున్న విద్యుత్ తీగలను సరిచేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఉన్నతాధికారులను రైతులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర-శింగరాయకొండ : ఇటీవల జరిగిన బదిలీల్లో స్థానిక బాలికల ఉన్నత పాఠశాల నుండి బదిలీపై వెళ్ళిపోయిన ఉపాధ్యాయినిలకు వీడ్కోలు సభను ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఇటీవల జరిగిన బదిలీలో ప్రధానోపాధ్యాయిని భారతితో పాటు ఉపాధ్యాయినిలు రాధామాధవి, పద్మ, కోటేశ్వరమ్మ, రమాదేవి, వెంకటలక్ష్మి, అనురాధలను ప్రధానోపాధ్యాయిని మహాలక్ష్మి ఘనంగా సన్మానించారు. గతంలో పనిచేసిన వారంతా పాఠశాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని వారి శ్రమను వృదా కానివ్వకుండా తాముకూడా పాఠశాలను చక్కగా పనిచేసేలా చేస్తామని పేర్కొన్నారు.ఈకార్యక్రమానికి జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ,సర్పంచ్ తరుపున కోటి, ప్రణయ్, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం, యుటిఎఫ్ ,ఎపిటిఎఫ్ ప్రతినిధులు, ఎంపిటిసి వాసవీదేవి తదితరులు పాల్గొని మాజీ ప్రధానోపాధ్యాయిని భారతీ పనితీరును ప్రశంసించారు. ఉపాధ్యాయినిలను ఘనంగా సన్మానించి ఘనమైన వీడ్కోలు పలికారు.

ఒంగోలు జాతి పశు సంపదను సంరక్షించుకోవాలి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ఒంగోలు జాతి పశు సంపదను కాపాడుకోవాలని పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు జే బేబీ రాణి సూచించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్,ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ మరియు పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణ సౌకర్యము సకాలములో అందుబాటు అవకాశం లేని ప్రకాశం జిల్లా పశ్చిమ మండలాలు యర్రగొండపాలెం, పుల్లలచెరువు, చంద్రశేఖర పురం రైతులకు చదలవాడ పశుక్షేత్రంలో అభివృద్ధి చేసిన మేలు జాతి ఒంగోలు కోడె దూడలను పశుసంవర్ధక జెడిఏ బేబీ రాణి ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జె డి ఏ మాట్లాడుతూ చదలవాడ పశుక్షేత్రంలో మేలైన ఒంగోలు జాతి పశుసంపదను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. డిడి రవికుమార్ ఒంగోలు జాతి పశు సంపద అభివృద్ధికి కృషి చేస్తున్నాడని అభినందించారు. అనంతరం సుమారు 20,000 విలువచేసే ఒక్కో కోడె దూడను 16 మంది రైతులకు ఉచితంగా ఇవ్వడంతో పాటు వాటి పోషణ, ఆరోగ్య సంరక్షణ కొరకు ఒక్కో కోడె దూడకు 9400 ప్రభుత్వం అందించటం జరుగు తుంద న్నారు. ఒంగోలు జాతిని పశు సంపదను అభివృధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణ అధికారి షేక్ కాలేశా పశుక్షేత్ర ఉపసంచాలకులు డాక్టర్ బి రవి పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాపు భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించండి

ఎమ్మెల్యే కేపీకి వినతి

విశాలాంధ్ర-మార్కాపురం : డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో కాపు భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని, అలాగే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మి చెన్న కేశవ స్వామి దేవస్థానం ప్రాంగణంలో శ్రీ కృష్ణ దేవరాయలు విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కోరుతూ ఎమ్మెల్యే కెపి నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళి కృష్ణలకు గురువారం శ్రీ కృష్ణ దేవరాయలు కాపు, బలిజ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. కాపు సంఘం నాయకులు శాసనాల వీరబ్రహ్మం, పత్తి రవిచంద్ర, రఘుపతి శివ, మద్రి రమణ, బందారు శ్రీను, ఏ.సుధీర్, నాయుడు (ఎస్టేట్) శిరిగిరి వెంకటేశ్వర్లు, ఆకుల గురవయ్య, చెన్నలక్ష్మి, నాగిశెట్టి, యం సుబ్బారాయుడు, పేరురి భాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

అక్రమ విద్యుత్‌పై తనిఖీలు

విశాలాంధ్ర-వెలిగండ్ల : అక్రమంగా విద్యుత్ వినియోగం చట్టరీత్యా నేరమని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని వెలిగండ్ల సబ్ స్టేషన్ పరిధిలో 25 బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో మండలంలోని అన్ని పంచాయతీలలో తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై 30 కేసులను నమోదు చేసి 92,000 వారి వద్ద నుండి అపరాధ రుసుమును విధించారు. ఇంజనీర్ ఆర్.ఉమాకాంత్, డిపి ఎద్యుకే టివ్ ఇంజనీర్ తోట శ్రీనివాసరావు, వెలిగండ్ల ఏఈ రసూల్ పాల్గొన్నారు.

శాఖాహారం నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర-శింగరాయకొండ : స్థానిక వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఉత్తరం వైపున శాలాహారం నిర్మాణానికి హైదరాబాద్ వాస్తవ్యులు విరాళం ప్రకటించినట్లు దేవస్థానం ఇవో కృష్ణవేణి తెలిపారు. హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌కు చెందిన తన్నీరు రాము, జ్యోతి దంపతులు ఈనిర్మాణానికి 3లక్షల రూపాయల విరాళం అందించేందుకు అంగీకరించినట్లు చైర్మన్ పామర్తి మాధవరావు తెలిపారు. దాతలు వారి తండ్రి గారైన తన్నీరు నరసింహులు స్మరణీయంగా ఈనిర్మాణానికి అంగీకరించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఏసీబీకి చిక్కిన వీఆర్ఓ

- వలంటీర్ తండ్రి పొలం మ్యూటేషన్, ఆన్లైన్ చేసేందుకు 30 వేల డిమాండ్
- రూ.21 వేలు ఇస్తున్నప్పుడు పట్టుకున్న వైనం
- వీఆర్వోను ఏసీబీకి పట్టించిన వలంటీర్
- వీఆర్ఓ దగ్గర మరో రూ.32వేల నగదు
- వీఆర్వో ఇంట్లో ఈ పాస్ పుస్తకాలు స్వాధీనం
- పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్న ఏసీబీ అధికారులు

విశాలాంధ్ర-కనిగిరి : వాలంటీర్ తండ్రి పొలాన్ని మ్యుటేషన్ ఆన్లైన్ చేసేందుకు రూ.21 వేలు లంచం తీసుకుంటూ మండలంలోని ఏరువారిపల్లి సచివాలయ విఆర్‌ఓ కాసు వేణుగోపాల్ రెడ్డి శుక్రవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పి వి శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు ఏరువారిపల్లి విఆర్‌ఓగా కాసు వేణుగోపాల్ రెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. కనిగిరి మండలం పేరంగూడిపల్లికి చెందిన వీరంరెడ్డి భాస్కర్ రెడ్డి (గోసులవీడు సచివాలయ వాలంటీర్) తండ్రి వీరంరెడ్డి లక్ష్మిరెడ్డికి ఏరువారిపల్లి పంచాయతీలోని ఆజీస్ పురంలో 2.73 ఎకరాల భూమిని మ్యుటేషన్ చేయాలని వీఆర్వో వేణుగోపాల్ రెడ్డిని వీరంరెడ్డి భాస్కర్ రెడ్డి సంప్రదించాడు. అయితే భూమిని మ్యుటేషన్ ఆన్లైన్ చేయడానికి 30 వేలు లంచం డిమాండ్ చేశాడు. అయితే లంచం ఇవ్వదానికి ఇష్టపడని వీరంరెడ్డి భాస్కర్ రెడ్డి రూ. 21 వేలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకొని ఏసీబీ అధికారులను సంప్రదించడం జరిగింది. శుక్రవారం వీరంరెడ్డి భాస్కర్ రెడ్డి తాహశీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్వో వేణుగోపాల్ రెడ్డితో మాట్లాడి ద్విచక్ర వాహనంపై కనిగిరి కపిల లాడ్జి సెంటర్‌కు తీసుకొని వచ్చి ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం రూ.21 వేలు అందజేయడం జరిగింది. మారువేషంలో ఉన్న ఏసిపి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా విఆర్‌ఓ వేణుగోపాల్ రెడ్డిని పట్టుకున్నారు. సంఘటన స్థలంలోనే పరీక్షలు నిర్వహించగా లంచం తీసుకున్నట్లు రుజువైందని డీఎస్పి శ్రీనివాసులు తెలిపారు. వీఆర్‌ఓను కనిగిరి తాహసిల్దార్ కార్యాలయానికి తరలించి విచారణ చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. తాహ సీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఓ కు సంబంధించిన మరో రూ. 32,300 నగదును స్వాధీనం చేసుకొని విచారించగా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించక ముందు ఓ భార్యాభర్త వచ్చి వీఆర్‌ఓకు ఆ నగదు ఇచ్చినట్లు తెల్పారు.

వీఆర్వో ఇంటిలోనూ సోదాలు చేపట్టిన ఏసీబీ అధికారులు

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాచవరంకు చెందిన వీఆర్వో కాసు వేణుగోపాల్ రెడ్డి నివసిస్తున్న నివాసంలో ఏసీబీ ఇన్స్పెక్టర్ అపర్ణ సోదరులు నిర్వహించగా 10 ఈ పాస్ పుస్తకాలు లభించడం జరిగింది. పాత ఈ పాస్ పుస్తకాలు విఆర్‌ఓ ఇంటిలో ఎందుకు ఉన్నాయని కోణంలో తాహశీల్దారు పుల్లారావు అడగక వీఆర్వో ఏ ఉద్దేశంతో తన వద్ద ఉంచుకున్నాడు తెలియదని గడువు తర్వాత వాటిని అందజేస్తే రద్దు చేసే వాళ్ళమని తాసిల్దారు వివరణ ఇచ్చారు. వీఆర్వో వేణుగోపాలన అరెస్ట్ చేసి రేపు నెల్లూరు ఎసిబి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు డిఎస్పి వి శ్రీనివాసరావు తెలిపారు. లంచం తీసుకోవడం నేరమని ఎవరైనా అధికారులు ఇబ్బందులు పెడుతుంటే ప్రజలు ఏసీబీ అధికారులను సంప్రదించాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచి అవినీతికి పాల్పడే వారి ఆట కట్టిస్తామన్నారు. ఈ దాడిలో ఏసీబీ ఇన్స్పెక్టర్లు పీవీ స్వర్ణ బాబు, సిహెచ్ శేషు, సిబ్బంది పాల్గొన్నారు.